క్లుప్తంగా

తలసీమియా సికిల్ సెల్ సొసైటీకి అవార్డు

రాజేంద్రనగర్: తలసీమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) చేస్తున్న సేవలకు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అప్రిషియేషన్ ఒకేషనల్ సర్వీస్ అవార్డు అందించింది. టీఎస్‌సీఎస్ సెక్రటరీ, సీఈవో డాక్టర్ సుమన్‌జైస్, ప్రెసిడెంట చంద్రకాంత్ అగర్వాల్ అవార్డును అందుకున్నారు. ఈ నెల 19వ తేదీన నగరంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రకటించారు. రోటరీ క్లబ్ ఇండియా నుంచి అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులను అందుకోవడం ఆనందంగా ఉందని చంద్రకాంత్ అగర్వాల్ వెల్లడించారు. తాము చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందించడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

పెద్దషాపూర్‌లో కంటి వెలుగు ప్రారంభం



కంటి వెలుగును ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం సర్పంచు చంద్రశేఖర్ ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా అంధత్వ నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఎల్లయ్య, గౌస్ పాషా, వైద్యుడు ప్రభాకర్, ఉప సర్పంచు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



రాజేంద్రనగర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని బీఆర్‌ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నాయకులు వెల్లడించారు. చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి, పద్మశాలిపురం డివిజన్‌లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు సోమవారం నాయకులు ప్రేమ్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్, వెంకటేష్, రాజేష్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పరీక్షల ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమన్నారు. తమ లక్ష్యాలను సాధించేందుకు కష్టపడాలన్నారు.

‘బీఆర్‌ఎస్‌కు అన్నివర్గాల మద్దతు’

గోల్కొండ: బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ అని కేసీఆర్ పక్కా సెక్యులర్ ముఖ్యమంత్రి అని సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు కార్వాన్ కంటెస్టెండ్ కార్పొరేటర్ ముత్యాల భాస్కర్ అన్నారు. సోమవారం కార్వాన్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆశయాలకు బీఆర్‌ఎస్ పాలన అద్దంపడుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేడు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కాపీ చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి ఉందని ఆయన అన్నారు.

‘రాష్ట్రంలో అవినీతి పాలన’



గోల్కొండ: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌కు చెందిన బీజేపీ నాయులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులు ఆయనను కలిశారు. ఆయన మాట్లాడుతూ.. స్వయంగా సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత భారీ అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పేపర్ లీకేజీలు కూడా మంత్రి కేటీఆర్ కనుసన్నలలో జరిగిందని ఆయన వివరించారు.

తీరనున్న ‘పంచవటి’ ముంపు సమస్య



రిటర్నింగ్ వాల్ నిర్మించనున్న పండెన్ వాగు నాలా

- రూ.9.80 కోట్ల నిధులు మంజూరు
- పూర్తిస్థాయిలో నిర్మాణం కానున్న రిటర్నింగ్ వాల్
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

మణికొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చిందంటే ఆ కాలనీ వాసులు బిక్కుబిక్కుమంటూ గడిపే పరిస్థితి నుంచి కాస్త ఉపశమనానికి వచ్చారు. గతంలో ఇరిగేషన్ శాఖ నుంచి రూ.7 కోట్ల వరకు నిధులు రావటంతో కొంత దూరం రిటర్నింగ్ వాల్ నిర్మించటంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. మిగిలిన మరికొంత దూరం నిర్మాణం చేపట్టి మమల్ని ముంపు సమస్య నుంచి పూర్తి స్థాయిలో పరిరక్షించాలని పలుమార్లు స్థానికులు వేడుకున్నారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.9.80 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

పై ప్రాంతాల నుంచి భారీగా వరద..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీకిపై మణికొండ ఎల్లమ్మ చెరువు, రాయదుర్గం చెరువులు ఉన్నాయి. వర్షాకాలంలో పైప్రాంతంలో కురిసే వర్షం నీరంతా పంచవటి కాలనీ మీదుగా నెక్నాంపూర్‌లోని ఇబ్రహీంబాగ్ చెరువు అక్కడి నుంచి మూసీ నదికి చేరుతుంది. పంచవటి కాలనీలోకి వచ్చేసరికి అక్కడ ఉన్న పండెన్ వాగు పూర్తిస్థాయిలో కుంచించుకుపోవటం, పక్కన లోతు ప్రాంతాలు ఉండటంతో అపార్ట్‌మెంట్లు సెల్లార్లు, రోడ్లపై నీరు పారుతుంది. గతంలో కాలనీ మొత్తం అదే పరిస్థితి ఉండగా అప్పట్లో ఇరిగేషన్ శాఖ నుంచి రూ. 7 కోట్ల వరకు మంజూరు కావటంతో కొంత దూరం రిటర్నింగ్ వాల్ నిర్మించటంతో అంత ప్రాంతం సమస్య తొలగింది. మిగిలిన ప్రాంతంలోనూ రిటర్నింగ్ వాల్ నిర్మించాలని అనేక సార్లు కోరారు. అదే విషయాన్ని స్థానిక మున్సిపల్ అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ప్రభుత్వానికి విన్నవించారు. దాంతో సోమవారం రూ.9.80 కోట్లు మంజూరు కావడంతో తమ సమస్య పూర్తిగా తొలగిపోతుందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం..

నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ‘సాక్షి’తో వెల్లడించారు. పంచవటి కాలనీకి గతంలోనే సగం సమస్య తీర్చగా ప్రస్తుతం మంజూరైన రూ.9.80 కోట్ల నిధులతో పూర్తిగా తీరుతుందన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలి

- నార్సింగి కౌన్సిలర్ ఉషారాణి



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్న కౌన్సిలర్ ఉషారాణి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని 17వ వార్డులో పైప్‌లైన్లు పాతవి కావటంతో నీటి సమస్య ఏర్పడిందని, కొత్త పైప్‌లైన్లు వేసినా నీటి సమస్య తీరలేదని కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. తన వార్డు పరిధిలో గత నాలుగు రోజులుగా నీటి సరఫరా రాకపోవటంతో సోమవారం మున్సిపాలిటీ నుంచి ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని అందించామన్నారు. గతంలో పైప్‌లైన్ సరిగా లేదన్న అధికారులు కొత్త పైప్‌లైన్లు వేసినా నీటి సరఫరా ఎందుకు కావటం లేదో జలమండలి అధికారులు తెలుపాలన్నారు. మంగళవారం(నేడు) సమస్య పరిష్కారం కాకపోతే జలమండలి అధికారుల పనితీరుకు నిరసనగా ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామన్నారు.

హైదర్‌గూడలో నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న సభ్యులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏకాదశి సందర్భంగా హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, 9 గంటలకు శ్రీమద్ భగవద్గీత పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. హైదర్‌గూడ పురవీధుల్లో తిరుగుతూ భజనలు నిర్వహించారు.

‘పది’ పరీక్షలపై శిక్షణ కార్యక్రమం

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్–2023 సంవత్సరానికి గానూ రాజేంద్రనగర్ మండలంలోని గురునానక్ ఉన్నత పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రాజేంద్రనగర్, శంషాబాద్, శేరిలింగంపల్లి, నార్సింగి, షాబాద్, చేవెళ్ల నందిగామ, కొత్తూరు, ఫారూక్‌నగర్, చౌదరీగూడ, కొందుర్గ్, మొయినాబాద్, కేశంపేట మండలాల నుంచి మొత్తం 220 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుషిందర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సబ్రహ్మనేశ్వరి, మండల విద్యాధికారి రామిరెడ్డి, నర్సింహ్మారావు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



జెండా ఊపి ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరించే 20 కొత్త ఆటోలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఆటోలు కొనుగోలు చేసేందుకు ప్రతి ఆటోకు రూ.2 లక్షల డౌన్ పేమెంట్ కార్పొరేషన్ నుంచి చెల్లించామన్నారు. ప్రస్తుతం 55 ఆటోలు విధుల్లో ఉన్నప్పటికీ ప్రజల సౌకర్యం కోసం మరో 20 కొత్త ఆటోలను ప్రారంభించామన్నారు. ప్రజలు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు. చెత్త చెదారాలు, వ్యర్థాలను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే అనేక రోగాల వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల శుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి రోజు ఇంటింటికి వచ్చే చెత్త సేకరణ ఆటో రిక్షాలకు చెత్తను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, పార్టీ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన

రాజేంద్రనగర్: భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్‌ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపడుతున్నామన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆరాంఘర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నామని కార్యకర్తలు, అభిమానులు హాజరవ్వాలన్నారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలి



పాదయాత్ర చేస్తున్న నాయకులు

మణికొండ: ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని మాదిగ విద్యార్థి ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. కార్తిక్ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ గ్రామంలో నిర్వహించిన మాదిగ సంగ్రామ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోతే ఏప్రిల్ 4న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట మహాధర్నాకు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలన్నారు. ఏప్రిల్ 4న హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిలటరీ జంగయ్య మాదిగ, నరేందర్ మాదిగ, గణేష్ మాదిగ, ఆంజనేయులు మాదిగ, శేఖర్‌మాదిగ, శివ మాదిగ పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’లో పేర్లు నమోదు చేసుకోవాలి



నమోదులో కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌లో ప్రజలంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్ తెలిపారు. అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడ బీజేపీ కార్యాలయం వద్ద ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఐదు లక్షల వరకు ఉచిత ఆరోగ్య భీమా ఆయూష్మాన్ భారత్ అందిస్తుంటే రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం సంబంధిత అధికారులతో ఉచితంగా నమోదు చేయించే కార్యక్రమం పెడితే బాగుండు అని ప్రైవేటు వ్యక్తులకు అవకాశం కల్పించడంతో వారు ఇష్టానుసారంగా డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని ప్రజలంతా ఉపయోగించుకోవాలన్నారు. ఉచితంగా ఆయుష్మాన్ భారత్‌లో పేర్లు నమోదు చేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాడెం సుధాకర్, సులిగె వెంకటేష్, సాయియాదవ్, సతీష్, మల్లేష్ పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

శంషాబాద్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ద్రోహులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. సోమవారం పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రశ్నాపత్రాల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ సంబంధిత మంత్రులందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో మహేష్, అఖిల్, ఖుషి, సింగ్, చందు, అకిల్, మేఘన, శివ, పవన్, భారత్, విజయ అఖిల్, నవీన్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ సాగుపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా సోమవారం ఏవీ కళాశాల విద్యార్థులు, రైతులకు ఆధునిక వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. సాగులో చేపట్టాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. రైతుల సమస్యలు–పరిష్కారం ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

‘మనూ’లో ఆకట్టుకున్న కార్యక్రమాలు



ఉర్దూ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రదర్శన

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డ్రామా క్లబ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్యాంపస్‌లోని యాంపీథియేటర్‌లో ఇగ్నైటెడ్ మైండ్స్–ఓపెన్ మైక్’ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇది క్యాంపస్‌లో నిర్వహించిన అయిదవ ఓపెన్ మైక్ ప్రోగ్రామ్. దీంట్లో మొత్తం 12 మంది విద్యార్థులు పాల్గొని కథలు, కవిత్వం, గజల్, మైమ్, మోనోయాక్ట్, యూనివర్సిటీ డ్రామా క్లబ్ ద్వారా ప్రత్యేక ప్రదర్శనతో సహా అనేక రకాల ప్రతిభను ప్రదర్శించారు. కల్చరల్ కోఆర్డినేటర్ మెరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్కీ..సూపర్

‘ఎస్కీ’ పనితీరుకు జాతీయ స్థాయి గుర్తింపు

- ఇప్పటి వరకు ప్రతిష్టాత్మకమైన 8 గోల్డెన్ పీకాక్ అవార్డులు
- వరుసగా మూడవ ఏడాదీ అవార్డు
- శిక్షణా కార్యక్రమాల నిర్వహణలో దేశంలోనే అత్యంత ఆదరణ



ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రధాన భవనం



దుబాయ్‌లో అవార్డు స్వీకరిస్తున్న ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు (ఫైల్)

రాయదుర్గం: శిక్షణా కార్యక్రమాలు....అత్యున్నత నాణ్యతాప్రమాణాలతో కోర్సుల నిర్వహణలో జాతీయ స్థాయిలో గుర్తింపును పొందింది గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ). అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంతో గోల్డెన్ పీకాక్ అవార్డులను సొంతం చేసుకుంటూ వస్తోంది. 2023 సంవత్సరానికి కూడా ఎస్కీని ఈ అవార్డు వరించింది. ఇటీవల ఈ అవార్డును ‘ఎస్కీ’ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు దుబాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును స్వీకరించడం విశేషం. ప్రతియేటా ‘ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఇండియా’ గోల్డెన్ పీకాక్ అవార్డును అందజేస్తోంది. ప్రతి సంవత్సరం న్యూఢిల్లీలో ఇచ్చే ఈ అవార్డును ఈ ఏడాది దుబాయిలో ఇవ్వడం విశేషం. ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 8సార్లు ఈ గోల్డెన్ పీకాక్ అవార్డులను సాధించడం విశేషం.

- ఎస్కీ గోల్డెన్ పీకాక్ అవార్డును 2007, 2008, 2010, 2011, 2012, 2021, 2022 సంవత్సరాలలో పొందింది. తాజాగా 2023లో కూడా ఈ అవార్డును పొందడం విశేషం.
- 2021,2022,2023 వరుసగా మూడేళ్లపాటు గోల్డెన్ పికాక్ అవార్డును ‘ఎస్కీ’ పొందడం సంస్థ పనితీరుకు నిదర్శనం.

‘ఎస్కీ’ గురించి..

- 1981లో గచ్చిబౌలిలో 70 ఎకరాల విశాల స్థలంలో ఏర్పాటు
- కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల అధికారులు, ప్రైవేటు సంస్థల వారికి కూడా వృత్తి నైపుణ్యం పెంచుకోవడానికి ఏడాది పొడవునా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తుంటారు.
- ఎస్కీలో నిర్వహించే కోర్సులు ఏఐసీటీఈ గుర్తింపు
- ఎస్కీలో విద్యాభివృద్ధి కోసం బిజినెస్ స్కూల్‌ను ఏర్పాటు చేసి దానికి స్కూల్ ఆఫ్ పోస్టుగాడ్యుయేషన్ స్టడీస్‌గా నామకరణం.
- ప్రస్తుతం పీజీ డిప్లొమో రెండేళ్ల కోర్సులను నిర్వహిస్తోంది.
- ఎస్కీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థల ఇంజినీర్లు, మేనేజర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది

ఈ అవార్డు సమష్టి కృషికి నిదర్శనం



‘ఎస్కీ’ సంస్థలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి, పనితీరుకు అవార్డు రావడమే నిదర్శనం. నా హయాంలో ఇది మూడవ గోల్డెన్ పీకాక్ అవార్డు. రాబోయే రోజుల్లో ‘ఎస్కీ’ని మరింతగా అభివృద్ధి పర్చి అనేక రకాల ప్రణాళిక లతో ముందుకు సాగుతాం. 8 అవార్డులు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది.

– డాక్టర్ జి. రామేశ్వరరావు డైరెక్టర్ ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా

అదిరేటి స్టెప్పేమేమేస్తే..

రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అదరగొట్టారు. -ఏజీవర్సిటీ



